క్లుప్తంగా

ఘనంగా బలుసుమూడి మావుళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారి విగ్రహ పత్రిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


పూజల్లో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం టూటౌన్‌లోని బలుసుమూడిలో వేంచేసియున్న శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. రోహిణి నక్షత్రయుక్త మేషలగ్నంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేదమంత్రోచ్చారణ మధ్య ఘనంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి ఆలయం పునఃనిర్మాణం చేసి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాలు సాధించేందుకు స్టార్టప్‌లు కీలకం

భీమవరం: వికసిత భారత లక్ష్యాలు సాధించాలంటే విద్యార్థులకు స్టార్టప్‌లు కీలకమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్టర్ దండు జగన్నాథరాజు అన్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన అనుసంధాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, అధ్యాపకులు పి భవాని, ఎంవీ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో డిజైనింగ్ ఆఫ్ సోలార్ పీవీ సిస్టమ్ అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన వర్కుషాప్ శనివారం ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్విన్ ఎనర్జీ టెక్నాలజీస్ మేనేజర్ బి పురుషోత్తంచారి విద్యార్థులకు సోలార్ డిజైనింగ్‌ను ప్రాక్టికల్ పద్ధతిలో శిక్షణ ఇచ్చారు.కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ప్రిన్సిపాల్ ఎం.అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయాల పురోభివృద్ధికి కృషి చేయాలి

ఆకివీడు: దేవాలయాల పురోభివృద్ధికి పాలకవర్గాలు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. స్థానిక మదన గోపాల స్వామి ఆలయ నూతన పాలకవర్గం శనివారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్‌గా భమిడి పాటి సూర్య భాస్కరరావు, డైరెక్టర్లుగా పత్తికాయల వెంకట లక్ష్మి, సన్నిధి వెంకట నారాయణ, ధనాల నాగమణి, పిట్టా పాండురంగారావు, తీపర్తి రాఘవమ్మ, బూరడ లక్ష్మి, సుదర్శనం రాధాకృష్ణమాచార్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో భీమవరం అసెంబ్లీ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాస రెడ్డి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, శ్రీనివాసరెడ్డి, బొమ్మారెడ్డి మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

భీమవరం: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసి ఆరోగ్య ప్రదాతగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సుమారు రూ.29.96 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చారని అన్నారు. ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యాన్ని రూ.5 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు పెంచి పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని వ్యాధులకు కూడా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేసి రోగులకు అండగా నిలిచారని శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, నూకల కనకారావు, బేతాల సంతోష్, ఏవీఆర్ సభాపతి, చిరుగుపాటి రాజు, దాయన ప్రకాష్, ఎం ఏసుపాదం పాల్గొన్నారు.


భీమవరంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

గ్రంధి శ్రీనివాస్ అభ్యర్థిత్వంపై హర్షం

వీరవాసరం: భీమవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గ్రంధి శ్రీనివాస్‌ను ప్రకటించడంతో శనివారం మండలంలో పలుచోట్ల సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. భీమవరం ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాసును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని వారన్నారు.


వీరవాసరంలో హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు

బాణసంచాలు కాలుస్తూ, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు నూకల కనకారావు, మాజీ మండల అధ్యక్షుడు గూడూరు ఓంకారం, గొరగాని సత్యనారాయణ, కందుల సురేష్, నేతల జ్ఞాన సుందర రాజు, గెడ్డం భాస్కరరావు, నూకల కిరణ్, మద్దాల బాబి, పాల శ్రీనివాస్, గిరి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యర్థిగా పీవీఎల్ ప్రకటనపై శ్రేణుల సంబరాలు

కాళ్ల/ఉండి: ఉండి నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడు కృతజ్ఞత కలిగి ఉంటానని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు స్పష్టం చేశారు. ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పీవీఎల్ నరసింహరాజు ను ప్రకటించడంతో పెదఅమీరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ నరసింహరాజుకు నియోజకవర్గం నాయకులు,కార్యకర్తలు ప్రజాప్రతినిధులు,అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో టీడీపీ కంచుకోటని పగలగొట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుక ఇస్తానని స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని నాయకులు, కార్యకర్తలు తనకు అండగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ప్రజలందరూ తనను ఆశీర్వదించాలని కోరారు. అలాగే ఉండి సెంటర్‌లో వైఎస్సార్ సీపీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండల కన్వీనర్లు, ఆయా గ్రామాల సర్పంచ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ అసెంబ్లీ టిక్కెట్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజుకు కేటాయించడంతో శనివారం ఆకివీడు ప్రధాన సెంటర్ వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భీమవరం అసెంబ్లీ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు ఈ సారి ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు అన్యెం కృష్ణ, వైస్ చైర్‌పర్సన్ వంగా జ్యోత్స్న, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, రాష్ట్ర ఐటీ విభాగం జనరల్ సెక్రటరీ పడాల కిషోర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు పుప్పాల పండు, శిరపు శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు చిక్కాల చిన్నా తదితరులు పాల్గొన్నారు.


కాళ్ల: పీవీఎల్‌ను అభినందిస్తున్న నాయకులు


ఉండి: బాణసంచా కాలుస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ఆకివీడు: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


పాలకోడేరు: రావి చెట్టు సెంటర్లో సంబరాలు చేస్తున్న నాయకులు

పాలకోడేరులో...

పాలకోడేరు: వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పీవీఎల్ నరసింహరాజును పార్టీ అధిష్టానం ప్రకటించడంతో శనివారం పాలకోడేరు రావి చెట్టు సెంటర్లో కార్యకర్తలు నాయకులు ఆనందోత్సాహంతో ర్యాలీ నిర్వహించి టపాసులు పేల్చారు. పీవీఎల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలోఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, ఉండి ఏఎంసీ వైస్ చైర్మన్ చేకూరి నరేంద్ర రాజు, కటిక శ్రీదేవి, జాలే సునీత, శివకోడు హనుమంతరావు, దెందుకూరి వెంకటరాజు, పెన్మత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్ బాబు, సామంతపూడి బాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 227 కేసుల పరిష్కారం

భీమవరం: జాతీయ లోక్ అదాలత్ ద్వారా 227 కేసులను పరిష్కరించామని భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 3వ అదనపు జిల్లా జడ్జి పి.శ్రీ సత్యాదేవి తెలిపారు. భీమవరంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని కేసులను పరిష్కరించుకున్నారు. ప్యానల్ లాయర్స్ పారా లీగల్ వలంటీర్లు, మీడియా సహకరించడం వల్లనే ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసినట్లు తెలిపారు. సివిల్ కేసులు 44, భీమవరం టౌన్, రూరల్, వీరవాసరం, ఉండి, పాలకోడేరు, కాళ్ళ, ఆకివీడు పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన క్రిమినల్ కేసులు 109, ఎక్సైజ్ కేసులు 20, మనోవర్తి కేసులు 10, చెక్ బౌన్స్ కేసులు 25, బ్యాంక్ రికవరీ కేసులు 9, బీఎస్ఎన్ఎల్ కేసులు 10 మొత్తం 227 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజీ చేసినట్లు జిల్లా న్యాయమూర్తి తెలిపారు. ఎక్సైజ్, చెక్ బౌన్స్ కేసుల్లో మొత్తం రూ.3,35,07,580 అవార్డులను జారీచేశామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను 4 బెంచ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పల స్వామి, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. సురేష్‌బాబు, 2వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ డి.ధనరాజు, సభ్యులుగా పి. మాలతీలత, ఎం. శ్రీనివాసరావు, కె. నాగరాజు, వి. కరుణాకరరావు, బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. పోలీస్ అధికారులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్రాంచ్ అధికారులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి సత్యాదేవి

జిల్లాలో సాగు నీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

భీమవరం(ప్రకాశం చౌక్): విజయవాడ, సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం గ్రూప్–1 పరీక్షలకు సంబంధించిన సూచనలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై సూచనలు, పట్టా, డీకేటీ, ప్రభుత్వ భూములకు సంబంధించి భూ సేకరణ, తాగునీరు, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జననం, మరణం నమోదు చట్టంపై సూచనలు, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు సుమిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరిస్తూ జిల్లాలో గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. రబీ సీజన్ పూర్తయ్యే నాటికి జిల్లాలో సాగునీటి ఎద్దడి ఉన్న మండలాల్లో నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టరు, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాథుర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వర రావు, డ్వామా పీడీయం ప్రభాకర రావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎ.రామస్వామి, జిల్లా పరిశ్రమల అధికారి యు.మంగపతిరావు, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుమిత్ కుమార్

జగన్ పాలనలో బొండాడ అభివృద్ధి

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో బొండాడ గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని బొండాడ గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు ఐదు లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలో రామాలయం వద్ద తానికొండ వారి వీధిలో స్థానికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకోగలుగుతున్నామని సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో మన్నే శ్రీనివాసు, పెనుమత్స రంగరాజు, మన్నే సోమేశ్వరరావు,కందుల హనుమ, మందపాటి రవి, కందుల ప్రభాకర్, తానుకొండ వెంకటేశ్వరరావు, కట్ట సుబ్బయ్య, శనాపతి వెంకటేశ్వరరావు, చిత్తలూరు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.


సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమేశ్వరరావు

మహనీయుడు పొట్టి శ్రీరాములు

భీమవరం: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని జిల్లా అడిషినల్ ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి భీమారావు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) టి శ్రీకాంత్ పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద గౌరవ వందనం చేస్తున్న దృశ్యం

హౌసింగ్ బోర్డ్ కాలనీలో...

భీమవరం (ప్రకాశంచౌక్): పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఆయన విగ్రహం వద్ద వందన సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. కంతేటి వెంకటరాజు గాంధీజీ,పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంతేటి వెంకట రాజు, సరిపిడకల రామారావు, సయ్యపరాజు సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నీ

భీమవరం: భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్, సీనియర్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కాస్మో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి పద్మరాజు, పెన్మెత్స రామరాజు చెప్పారు. శనివారం క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పోటీల వివరాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 200 మంది టెన్నిస్ క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. 20న సాయంత్రం 5 గంటలకు ప్రధాన పోటీలను వేగేశ్న, వెంకటరాయవర్మ ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి వీవీఎస్ సుబ్రహ్మణ్యవర్మ, జాయింట్ సెక్రటరీ కురిశేటి సత్యనారాయణమూర్తి, అరిటాకుల రాంబాబు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో శిక్షణ అందించాలి

భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా భీమవరంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్లో నిర్వహించిన ఉచిత చదరంగం శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ విజయ మాట్లాడుతూ విద్యతోపాటు పిల్లల ఆసక్తిని గమనించి క్రీడలు, కళారంగాల్లో శిక్షణ అందించాలన్నారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఇప్పటివరకు స్టేజ్ వన్‌లో విద్యార్థులకు శిక్షణ అందించామన్నారు. సెయింట్ మేరీ స్కూల్లో సుమారు 400 మంది శిక్షణ పొందినట్లు తెలిపారు.అనంతరం క్రీడాకారులకు చెస్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ పెదపాటి రవికుమార్, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళ మెడలోని నల్లపూసల తాడు అపహరణ

భీమవరం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ మెడలోని నల్లపూసల తాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని పోలీసులు తెలిపారు. ఈనెల 15న భీమవరంలోని ఒక వివాహ వేడుకకు జి.లక్ష్మీదేవి హాజరై ద్విచక్రవాహనం వెనుక కూర్చొని వెళ్తుండగా రాత్రి 10 గంటల సమయంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఒక్కసారిగా ఆమె మెడలోని మూడు కాసుల బంగారం నల్లపూసల తాడును అపహరించారు. ఆ సమయంలో బాధితురాలు ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి గాయపడ్డారు. ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఉండి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యావ్యవస్థకు అందించిన సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకుని భవిష్యత్‌లో గొప్పవారు కావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షుడు జి. సుందర్‌కుమార్ అన్నారు. శనివారం ఉణుదుర్రు జెడ్పీ హైస్కూల్ టెన్త్ క్లాస్ విద్యార్థులకు వజ్రపు జాన్ జశ్వంత్ ఆర్థిక సహకారంతో ఈ నెల 18 నుండి జరిగే పరీక్షలకు అవసరమైన విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. హెచ్‌ఎం రత్నకుమార్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ ఆరోపణలపై సర్వే

ఉండి: వాండ్రం గ్రామ శివారు వాండ్రంలంకలో శ్మశానం, రహదారి ఆక్రమణల నేపథ్యంలో దళితులు చేసిన ఫిర్యాదుపై ఈ నెల 8న ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ ఈ ప్రాంతంలో పర్యటించారు. ఆయన ఆదేశాలతో అధికారులు శనివారం సర్వే నిర్వహించారు. ప్రభుత్వ స్థలాలను వీఆర్వో ఎస్.చిన్నారావు, ఆర్ఐ కార్తీక్, పంచాయతీ కార్యదర్శి జేవీటీ నాయుడు ఆధ్వర్యంలో సర్వే చేశారు.